క్లుప్తంగా

వైభవంగా శివ సహస్రనామ పూజలు



శివసహస్రనామార్చనలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సప్తసోమవారాల ప్రదక్షిణల్లో పాల్గొని ఏడు సోమవారాలు పూర్తిచేసుకున్న భక్తులు మంగళవారం శివ సహస్రనామ పూజల్లో పాల్గొన్నారు. సుమారు 80 మంది భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పసుపులేటి వాసు, అర్చకులు అనిల్, మద్దూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి జాతీయ ఐక్యత అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరువీధుల రాజరాజేశ్వరి తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ నుంచి నేషనల్ యూనిటీ అవార్డు (జాతీయ ఐక్యత అవార్డు) అందుకున్నారు. మంగళవారం రాజరాజేశ్వరి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో జరిగిన అంతర్జాతీయ యువజన దినోత్సవ ముగింపు ఉత్సవాల్లో ఈ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. సామాజిక సేవా రంగంలో చేసిన సేవలకు గానూ ఈ అవార్డు వచ్చిందన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ప్రిన్సిపాల్‌కు అభినందనలు తెలియజేశారు.

పాఠశాలలకు శానిటరీ మెటీరియల్స్ అందజేత



పాఠశాలలకు శానిటేషన్ మెటీరియల్ అందిస్తున్న ఝాన్సీలక్ష్మీబాయి

పాలకొల్లు సెంట్రల్: ప్రతి పాఠశాలలో టాయిలెట్స్‌ను పరిశుభ్రంగా ఉంచాలని తద్వారా పిల్లలకు ఆరోగ్య భద్రత కల్పించవచ్చని బీఆర్‌ఎంవీ మునిసిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎ.ఝాన్సీ లక్ష్మీబాయి అన్నారు. మంగళవారం స్థానిక బీఆర్‌ఎంవీ స్కూల్ క్లస్టర్ పరిధిలోని వివిధ పాఠశాలలకు ప్రభుత్వం అందించిన శానిటరీ మెటీరియల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ లక్ష్మీబాయి మాట్లాడుతూ పాఠశాలల్లో పనిచేసే స్కావంజెర్స్ బాత్రూమ్స్ పరిశుభ్రంగా ఉంచాలని వాటి కోసం రిప్లెక్టివ్ జాకెట్స్, గ్లౌజెస్, వైపర్స్, టాయిలెట్ బ్రష్, ప్లాస్టిక్ బకెట్స్, డస్ట్‌బిన్స్ మొదలైన పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో జీపీఎస్‌వీఆర్‌ఎం పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, ఉపాధ్యాయులు మధు,రమేష్, సీఆర్పీ రాజేశ్వరి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కుళాయి పన్నులు చెల్లించాలి



ఎం.అంజయ్య

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీకి సంబంధించి కుళాయి పన్నుల బకాయిలు వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుళాయి పన్నుల బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకుపోయాయని చెప్పారు. ప్రజలకు మెరుగైన మంచినీటి సరఫరా చేయాలంటే పన్నుల బకాయిలు సకాలంలో చెల్లిస్తేనే సాధ్యమవుతుందన్నారు. కుళాయి పన్నులు మున్సిపల్ కార్యాలయం కౌంటర్‌తో పాటు ఆన్‌లైన్‌లోను కూడా చెల్లించవచ్చని సూచించారు. పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జరిమానా

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరికి భీమవరం స్పెషల్ జ్యుడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున రూ. 20 వేలు విధించినట్లు రూరల్ ఎస్సై ఐ. వీర్రాజు తెలిపారు. ఈ నెల 8న కొవ్వాడ పుంత సెంటర్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పూజారి వెంకట్రావు, కొమ్మన వెంకటేశ్వరరావులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశామని వివరించారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చడంతో ఈ మేరకు జరిమానా విధించారని పేర్కొన్నారు.

నీట మునిగిన పంట పొలాలు

- భగ్గేశ్వరం డ్రెయిన్ పొంగడంతో 100 ఎకరాలు రైతులకు తీవ్ర నష్టం
- నీరు లాగినా నాట్లు కుళ్లిపోతాయని వాపోతున్న రైతులు



తూడుతోతో నిండిపోయిన భగ్గేశ్వరం డ్రెయిన్



ఎస్.చిక్కాలలో చెరువును తలపిస్తున్న వరి చేలు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు మండలంలోని శివదేవుని చిక్కాల గ్రామంలో భగ్గేశ్వరం డ్రెయిన్ పొంగడంత సుమారు 110 ఎకరాల వరకూ వరి పంట నీట మునిగాయి. ఇప్పటికే రైతులు నారుమడులు వేసి దాదాపుగా 25 రోజులు కావస్తుంది. గత ఐదు రోజులుగా చేలు నీటిలో ఉండడంతో నారు మడులు కుళ్లిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుందని వ్యవశాయ శాఖ అధికారులు వివరిస్తున్నారు. ఎంటీయూ 1318, స్వర్ణ, ఎంటియు 1061, 1064 విత్తనాలు ఐదు రోజులు వరకూ ముంపును తట్టుకునే అవకాశం ఉంటుంది. అంతకు మించి ఎక్కువ రోజులు నీటిలో ఉన్నా నారుమడి నిలబడే అవకాశం ఉండదని అధికారులు చెపుతున్నారు. నీరు లాగిన తరువాత పొలం బాగా ఆరబెట్టాలి. నారుమడి పూర్తిగా దెబ్బతింటే స్వల్పకాలిక రకాలతో మరలా తిరిగి విత్తనాలు జల్లుకోవాల్సి ఉంటుంది. లేదంటే ఆలస్యంగా ఊడ్పులు చేసిన రైతులు నుండి ఆకు మిగిలితే ఆకును కొనుగోలు చేసుకుని నాట్లు వేసుకోవాల్సి ఉంటుంది. ఆకు దొరకని పక్షంలో మళ్లీ విత్తనాలు జల్లుకుని మొలకెత్తిన అనంతరం నాట్లు వేసుకోవాల్సి ఉంటుంది. తద్వారా పంట చేతికందేసరికి దాదాపుగా నెలా పది రోజులు ఆలస్యం అయ్యే అవకాశం ఉంటుంది.

నీరు లాగడం కలే

భగ్గేశ్వరం మురుగు డ్రెయిన్‌లో నీరు ప్రస్తుతానికి లాగే అవకాశమైతే కనిపించడంలేదు. నీరు పారుదల లేక నిలబడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. శివదేవుని చిక్కాల శివారు, వెలివెల గ్రామం మొదట్లో లంకలకోడేరు గ్రామానికి సరిహద్దులో ఉన్న పొలాలు ఈ ముంపుకు గురయ్యాయి. మురుగునీరు చెత్త తూటుతో కదిలే పరిస్థితి అయితే ఇప్పట్లో కనిపించడంలేదు. ఇప్పటికే నష్టపోయామని, నీరైనా లాగితే మళ్లీ విత్తనాలు జల్లుకోవడమో లేదా ఆకు కొనుక్కుని నాట్లు వేసుకోవడమో చేస్తామని రైతులు తొందరపడుతున్నారు. ఎంటీయూ 1064, పీఎల్‌ఏ 1100 వంటి రకాలు వారం రోజులు మునకలో ఉన్న తట్టుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. అలాగే ఆకులు పైకి కనిపిస్తూ 30 లేక 40 సెంటీమీటర్లు నీరు నిలబడే పల్లపు ప్రాంతాల్లోని మధ్యస్థ ముంపుని కూడా తట్టుకుంటాయని అదే ఎంటీయూ 1232 రకం అయితే 10 నుంచి 12 రోజులు తాత్కాలిక ముంపును కూడా తట్టుకుంటాయని వివరిస్తున్నారు. పోడూరు మండలంలో దాదాపుగా 60 ఎకరాలు నీట మునిగాయి. యలమంచిలి మండలంలో 13 ఎకరాలు నక్కల కాల్వ సమీపంలో ఉన్న పొలాలు నీట మునిగాయి. వాతావరణ శాఖ మరో నాలుగు రోజులు వర్షాలు అధికంగా ఉంటాయని హెచ్చరిస్తుండడంతో రైతులు ఆందోళనలకు గురవుతున్నారు.



శివదేవుని చిక్కాలలో ఏకమైన గట్టు, చేలు



లంకలకోడేరులో పొలంలో నిల్వ ఉన్న వర్షం నీరు



పోడూరు మండలం తూర్పుపాలెంలో నీట మునిగిన వరి చేలు

మహిళలకు శాపంగా మారిన ప్రభుత్వ నిర్ణయాలు

పాలకొల్లు సెంట్రల్: కూటమి ప్రభుత్వ నిర్ణయాలు రాష్ట్రంలో మహిళలకు శాపంగా మారాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కూటమి పాలనలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు మహిళల భద్రతకు విఘాతం కలిగిస్తున్నాయన్నారు. బడి, గుడి అనే తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ చివరకు రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ల వద్ద కూడా విచ్చలవిడిగా మద్యం షాపులు ఏర్పాటుచేస్తుండడం దురదృష్టకరమన్నారు. బ్రాందీషాపులు ఉన్న ప్రాంతాల్లో మహిళలు ఆ రోడ్డు గుండా వెళ్లడానికి భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. అంతే కాకుండా రోడ్లపై తాగి తూగమని పర్మిట్ రూమ్‌లకు అనుమతులు ఇవ్వడం చూస్తుంటే మహిళలు రోడ్లపై వెళ్లేటప్పుడు ఎలా ఇబ్బందులు పడినా కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని ఆదాయమే పరమావధిగా పనిచేస్తుందన్నారు. ప్రజలతో ఎంత మద్యం తాగిస్తే అంత ఆదాయం వస్తుందనే దురాలోచనలోనే కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఇప్పటికైనా మద్యం విక్రయాల విషయంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని కోరారు.

వరద ముంపులోనే గోస్తనీ పొలాలు



దర్బరేవు డ్రెన్ ముంపు నీటిని లాగక పోవడంతో ముంపు బారిన పడిన వరిచేలు



ఎస్ . ఇల్లిందలపర్రు గ్రామంలో ముంపు నీటిలో ఉన్న వరి నాట్లు

పెనుమంట్ర: ఐదు రోజుల క్రితం కురిసిన భారీ వర్షం కారణంగా పెనుమంట్ర మండలంలోని గోస్తనీ డ్రెయిన్ పరివాహక ప్రాంతంలో ఉన్న ఎనిమిది గ్రామాలకు చెందిన సుమారు 1000 ఎకరాల వరకు ఇటీవల వేసిన వరి నాట్లు వరద నీటి ఉధృతికి ముంపు బారిన పడ్డాయి. గోస్తనీ నదిలో దట్టంగా పేరుకుపోయిన కిక్కిస, గుర్రప్రు డెక్క చెత్తతో పేరుకుపోయి మురుగునీరు త్వరితగతిన కిందకు వెళ్లకపోవడంతో ఎస్ ఇల్లిందలపర్రు, మల్లిపూడి, నత్త రామేశ్వరం, జుత్తిగ, వెలగల వారి పాలెం, పెనుమంట్ర, గరువు, మాముడూరు గ్రామాలకు చెందిన రైతుల పొలాల్లోని వరద నీరు బయటకు వెళ్లే మార్గం లేక వరినాట్లు ముంపులోనే ఉన్నాయి. రైతులు ముంపు గురైన పొలాల్లో వరద నీరు తగ్గిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల న్యూర్ది రేట్ ఆఫ్ ఫాటోస్ పోస్టర్ దోసగా వేసుకోవాలని వ్యవసాయాధికి బి .దేవి స్వరూప తెలిపారు.

నరసాపురంలో.

నరసాపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో అధిక వర్షాలకు మురుగు కాలువలన్నీ పోటెత్తాయి. దర్బరేవు, రుస్తుంబాద, కాజ, మొగల్తూరు తదితర డ్రెయిన్లు ముంపు నీటిని లాగకపోవడంతో ఆయా డ్రెయిన్‌లను ఆనుకుని ఉన్న వందలాది ఎకరాలు ముంపు బారిన పడ్డాయి. దీంతో ముంపు బారిన పడిన పంటచెల్లలోని వకిదుబ్బులన్నీ కూలిపోయాయని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు లెక్కల ప్రకారమే నరసాపురం మండలంలో 1,157 ఎకరాలు, మొగల్తూరు మండలంలో 43 ఎకరాలు ముంపు బారిన పడ్డాయని రైతులు వాపోతున్నారు.

ప్రత్యేక వ్యాక్సినేషన్‌కు తల్లిదండ్రులు సహకరించాలి



చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: పిల్లలకు వేసే ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమానికి తల్లిదండ్రులు సహకరించాలని డాక్టర్ ఎం.నవ్యజీవన్ అన్నారు. మంగళవారం స్థానిక లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రతి బుధవారం, శనివారం వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల వ్యాక్సిన్‌లు వేయించుకోనివారికి అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో 18వ తేది నుంచి 23వ తేది వరకూ ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 5 నుంచి 7 సంవత్సరాల పిల్లలకు డీపీటీ బూస్టర్ డోసు, 10 నుంచి 16 సంవత్సరాలు పూర్తయిన పిల్లలకు టీడీ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు. విద్యాశాఖ, పంచాయతీ రాజ్ శాఖ, అంగన్‌వాడి సిబ్బందిల సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు



కనకాయలంకలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న ఎ.గీతాభాయి

యలమంచిలి: వరద ప్రాంతాలలో ప్రజలకు అత్యవసర వైద్య సేవలన్నీ అందుబాటులో ఉంచామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎ గీతాభాయి చెప్పారు. వరదముంపులో ఉన్న కనకాయలంక గ్రామంలో మంగళవారం ఆమె పర్యటించారు. కాన్పుకు దగ్గరగా ఉన్న గర్భిణులను, బాలింతలను, దీర్ఘ కాలంగా మంచం మీద చికిత్స పొందుతున్న రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆమె ఆదేశాలు ఇచ్చారు. ప్రజలంతా ఏ వైద్య సహాయం కావాలన్నా గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. వైద్య ఉద్యోగులు షిఫ్ట్స్ వారీగా ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండాలని చెప్పారు. అనంతరం ఆమె స్థానిక తుఫాన్ షెల్టర్ ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపును సందర్శించారు. శిబిరంలో ఏయే మందులు ఉంచారని ఆమె ప్రశ్నించగా దొడ్డిపట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కర్రి చంద్రరేక పాముకాటు మందులు, కుక్కకాటు మందులు, ధనుర్వాతం రాకుండా ఇంజక్షనులు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఆమె సూపర్‌వైజర్ ఎస్.నిర్మలకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ వై.రాధ, ఏఎన్‌ఎం జి.లక్ష్మీ ఉన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



నరసాపురం: డాగురే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఫొటో గ్రాఫర్స్



యలమంచిలి: కట్టుపాలెంలో ఫొటోగ్రాఫర్స్‌ను సన్మానిస్తున్న జోగాడ ఉమామహేశ్వరరావు

నరసాపురం: ప్రపంచ గతిని మార్చిన చరిత్ర ఫొటోగ్రఫీదేనని పలువురు ఫొటోగ్రాఫర్లు అన్నారు. మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నరసాపురం ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా శివాలయం సెంటర్‌లో ఉన్న కెమెరా సృష్టికర్త డాగురే విగ్రహానికి పూలలు వేసి నివాళులర్పించారు. ఫొటోగ్రాఫర్స్ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్స్ యూనియర్ జిల్లా అధ్యక్షుడు కేపిటల్ రాజు, నరసాపురం శాఖ అధ్యక్షుడు ఉమాశేఖర్, కార్యదర్శి రాంబాబు, కోశాధికారి కోట్ల బాలకృష్ణ, సందీప్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కట్టుపాలెంలో..

యలమంచిలి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం కట్టుపాలెం గ్రామంలో స్థానిక ఫొటోగ్రాఫర్స్, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దేవ రాజేష్ చిట్టి డిజిటల్ స్టూడియో అధినేత, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మామిడిశెట్టి చిట్టిబాబులను రాహుల్ సామాజిక సేవా సంస్థ అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జోగాడ ఉమామహేశ్వరరావు శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రను సజీవంగా నిలిపే ఫొటోగ్రఫీని ఆదరించాలని కోరారు. సెల్‌ఫోన్ల రాకతో ఫొటోల ప్రాముఖ్యత తగ్గిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు వీరా మల్లికార్జునుడు పాల్గొన్నారు.

కలెక్టరేట్ భవన నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలి

భీమవరం: కలెక్టరేట్ భవనం నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలని, ప్రజా ప్రతినిధులను, రాజకీయ పక్షాలను కలుపుకుని ప్రజామోదయోగ్యంతో కలెక్టరేట్ నిర్మాణం ఉండాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆయన ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీవీ ప్రతాప్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లాలో నూతన కలెక్టరేట్ భవనాన్ని ఎక్కడ నిర్మిస్తారో తక్షణం జిల్లా అధికారులు జిల్లా ప్రజాప్రతినిధులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీ–4పద్ధతిలో కలెక్టరేట్ భవన నిర్మాణం అంటే ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడమేనని మండిపడ్డారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

భీమవరం: ఆసుపత్రిలో చికిత్స పొంది ర్యాపిడో మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళుతున్న మహిళను మరో మోటార్ సైకిల్ ఢీకొట్టిందని భీమవరం టూటౌన్ ఏఎస్సై ఎన్.వెంకటరావు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మల్టీప్లెక్స్ వెనుకగల యాదవుల వీధికి చెందిన వెలుగుల కనక మహాలక్ష్మి ఈనెల 18న భీమవరం ప్రైవేటు ఆసుపత్రిలోని చికిత్స అనంతరం ర్యాపిడో మోటార్ సైకిల్‌పై వెళుతుండగా వేగంగా వస్తున్న మరో మోటార్ సైకిల్ ఈమె ప్రయాణిస్తున్న ర్యాపిడో మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె గాయపడడంతో చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై వెంకట్రావు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏడిఏ మురళీకృష్ణ

పాలకొల్లు సెంట్రల్: గ్రామాల్లో చిన్న చిన్న కమతాల్లో సాగు చేస్తున్న రైతులు నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నారని వ్యవసాయ శాఖ ఏడిఏ పి.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని చింతపర్రు గ్రామంలో ఏడీఏ సబ్ డివిజన్ పరిధిలో పాలకొల్లు, పోడూరు, ఆచంట మండలాల్లో పని చేస్తున్న రైతు సేవా కేంద్ర ఇన్‌చార్జ్‌లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం, వాతావరణంలో ఉష్ణోగ్రతలు, వాయు కాలుష్యం, నేల కాలుష్యాలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా తగ్గించవచ్చన్నారు. వరి సాగులో ఎరువుల యాజమాన్యం పురుగు మందుల యాజమాన్యం అలాగే నవధ్యాన్యాల సాగు ద్వారా నేల సారాన్ని పెంచవచ్చునని తెలిపారు. మనం తినే ఆహారంలో పురుగుమందులు అవశేషాలు కారణంగా మనుషులు అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. అందువల్ల పురుగుమందులు, రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు ద్వారా సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంవై నూకరాజు, డీఆర్‌సీపి ఒ.సామ్యూల్ జాన్సన్, పాలకొల్లు, పోడూరు, ఆచంట ఏఓలు రాజశేఖర్, ఎం.విశ్వాసరావు, బి.నాగరాజు, వ్యవసాయ సిబ్బంది మురళీకృష్ణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 13న లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని, రాజీ చేసుకోదగిన కేసులను కక్షిదారులు పరికరించుకోవడానికి ఇదో మంచి అవకాశమని వివరించారు. అన్ని రకాలు కేసులు రాజీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారుల్లో అవగాహన కల్పించి లోక్ అదాలత్ విజయవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు, న్యాయవాదులకు సూచించారు.

లాకుపేట అప్రోచ్ రోడ్డు నిర్మించాలి

నరసాపురం: 216 జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న లాకుపేటకు అప్రోచ్‌రోడ్డు నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. 216 జాతీయరహదారి నిర్మాణం పూర్తయినా కూడా లాకుపేటకు అనుసంధానంగా ఉన్న అప్రోచ్‌రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ప్రస్తుత వర్షాకాలంలో ప్రయాణం నరకంగా ఉంటుందని, ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. గతంలో మీకోసం కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

ఉపాధి హామీలో పంచాయతీ కార్యదర్శుల జోక్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పాలకొల్లు సెంట్రల్: ఉపాధి హామీ పనుల్లో ఇప్పటికే ప్రత్యేక యంత్రాంగ సిబ్బంది ఉన్నారని, కొత్తగా పంచాయతీ కార్యదర్శుల పాత్ర అవసరం లేదని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు అన్నారు. మంగళవారం స్థానిక సమతా మహిళా భవనంలో జిల్లా అధ్యక్షుడు బాతిరెడ్డి జార్జి అధ్యక్షతన ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాకమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌరు పెద్దిరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నాడు గ్రామంలో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లుకట్టిస్తానని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు అమలు చేస్తామన్న నిర్ణయం ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం ప్రజాధనం వృథా చేయడానికేనని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కండెల్లి సోమరాజు, ఎస్.అత్రియా, ఎద్ల చిట్టిబాబు, జె.వెంకటలక్ష్మి, షేక్ పాదుషా, ఎద్ల మోహనరావు, నరాలశెట్టి రామకృష్ణ, ఎం.మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై పృథ్వీ

పాలకొల్లు సెంట్రల్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా క్షణాల్లో మన వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించే ప్రమాదం ఉందని పట్టణ ఎస్సై జి.పృథ్వీ అన్నారు. మంగళవారం స్థానిక దాసరి నారాయణ రావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై పృథ్వీ మాట్లాడుతూ యువత ఫోన్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ యాప్‌లు కనిపిస్తే వాటిని క్లిక్ చేస్తే తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆన్‌లైన్ షాపింగ్ విషయాల్లో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. అపరిచితులతో చాటింగ్ చేయకూడదని సూచించారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ చేయకూడదని, ప్రోత్సహించకూడదని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, ఏఎస్సై మార్‌లింగం, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, నోబుల్ రాజ్, పీఓ జాన్‌రాజ్, జూలియా, సంధ్య, విజయలక్ష్మి, డాక్టర్ సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.